క్లుప్తంగా

చదరంగం పోటీల్లో ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రాబర్ట్ రాజ్‌ను సత్కరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

సామర్లకోట: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ స్పోర్ట్స్ అథారిటీ ప్రాంగణంలో నిర్వహించిన చదరంగం పోటీల్లో సామర్లకోటకు చెందిన రేగుళ్ల రాబర్ట్‌రాజ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న రాబర్ట్ రాజ్ చదరంగం పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గురువారం అతన్ని వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ ఆధ్వర్యంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంఈఓ డి శ్రీలలిత, ఎంఈఓలు పి.వుల్లయ్య, వై.శివరామకృష్ణయ్య అభినందించారు.

బీమా సాయం పంపిణీ



మృతుని భార్యకు రూ.10 వేలు అందజేస్తున్న కౌన్సిలర్, వెల్ఫేర్ సెక్రటరీ

సామర్లకోట: స్థానిక 14వ వార్డు సంగీతరావుపేటకు చెందిన మామిడి త్రిమూర్తులు(43) అనారోగ్యంతో బాధపడుతూ ఏలేశ్వరంలో బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ త్రిమూర్తులు మృతి చెందడంతో విషయం తెలుసుకున్న సచివాలయ సిబ్బంది స్పందించారు. అతనికి వైఎస్సార్ బీమా ఉండడంతో బీమా పథకం వర్తించే విధంగా చేశారు. ముందుగా మట్టి ఖర్చులకు రూ.10 వేలను మృతుని భార్య లోవరత్నంకు అందజేశారు. కౌన్సిలర్ స్వయంవరపు వీరభద్రరావు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ జోగారావులే ఏలేశ్వరం వెళ్లి నగదు అందజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: వీకే రాయపురం శివారు మామిళ్లదొడ్డి ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై టి.సునీత సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఎటువంటి వివరాలు లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు చామన చాయ రంగులో ఉండి 5.8 ఎత్తు, 30 నుంచి 35 ఏళ్ల వయసు ఉంటుంది. మరిన్ని వివరాలకు 94407 96568, 97016 26505 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

చార్జీలు పెంచాలని వినతి



ఐఎంఎఫ్ఎల్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హమాలీల సంఘ నాయకులు

సామర్లకోట: స్థానిక ఐఎంఎఫ్ఎల్ డిపోలో ఎగుమతి, దిగుమతి చార్జీలు పెంచాలని హమాలీల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిపో మేనేజర్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నెల 19వ తేదీ లోపు కూలీల రేట్లు పెంచాలని, పెంచకపోతే 20వ తేదీ నుంచి డిపోలో మద్యం బాటిళ్ల దిగుమతులను నిలిపివేస్తామని సంఘ నాయకులు ఎన్‌వీవీ సత్యనారాయణ, వి.కొండలరావు, వి.అప్పరాజు హెచ్చరించారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం



వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: శ్రావణ అమావాస్యను పురస్కరించుకుని రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి గురువారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, అర్చకులు దత్తాత్రేయ శర్మ, వనదుర్గ ఆలయ అర్చకులు యడవిల్లి ప్రసాద్, వ్రతపురోహితులు కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

ఆ వెలుగులు ఎక్కడ!

- కనుమరుగవుతున్న బాణసంచా తయారీ షాపులు
- మండలంలో నాలుగు షాపులకే అనుమతి



వేట్లపాలెంలో బాణసంచా తయారీ చేస్తున్న కార్మికులు

సామర్లకోట: వెలుగుల పండుగ దీపావళి వస్తుందంటే అందరికీ ఆనందమే.. టపాసుల సందడి అంతా ఇంతా కాదు. ఈ బాణసంచా తయారీకి జిల్లాలో వేట్లపాలేనికి పెట్టింది పేరు. ఇక్కడ బాణసంచా తయారీ ఓ కుటీర పరిశ్రమగా ఉండేది. పది షాపులు శాశ్వత లైసెన్సులు కలిగి 365 రోజులూ మందుగుండు సామగ్రి తయారు చేసేవారు. అదేవిధంగా దసరా ఉత్సవాలకు బాణసంచా తయారీ ఎక్కువ జరిగేది. వీటిని వేట్లపాలెం నుంచి పెళ్లిళ్లు, పండగలు, దసరా ఉత్సవాలకు తీసుకువెళ్లేవారు. అనేక సినిమాల్లో వేట్లపాలెం బాణసంచాను ఉపయోగించారంటే ఇక్కడి ప్రాధాన్యం అర్థం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బాణసంచా పోటీల్లో అనేక బహుమతులు ఈ గ్రామ జాబితాలో ఉన్నాయి. ఇక్కడి షాపుల్లో తరచూ అగ్ని ప్రమాదాలు సంభవించి అనేక మంది చనిపోవడంతో ప్రభుత్వం అనేక నిబంధనలను కఠినతరం చేయాల్సి వచ్చింది.

నిబంధనలు పాటించాల్సిందే..

ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా బాణసంచా తయారీ షాపుల్లో నిబంధనలను పక్కా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధనల్లో ప్రధానంగా.. ప్రధాన రోడ్డు నుంచి బాణసంచా తయారీ షాపులు 45 మీటర్ల దూరంలో ఉండాలి. బాణసంచా తయారు చేసే షెడ్‌కు గోదాముకు మధ్య 10 మీటర్ల దూరం అవసరం. షెడ్ తలుపులు కలపతో తయారు చేయాలి. వీటితో పాటు అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ఇటువంటి నిబంధనలు పాటించలేని వ్యాపారులు తయారీకి దూరం అయ్యారు. వేట్లపాలెం కెనాల్ రోడ్డు సమీపంలో వరుసగా మూడు బాణసంచా తయారీ షాపులు ఉండేవి. ఇందులో రెండు షాపులను మూడేళ్ల నుంచి మూసేశారు. వీటిని టైల్స్ విక్రయ దుకాణాలుగా మార్చేశారు. మరికొంత కాలానికి బాణసంచా తయారీ కనుమరుగయ్యే అవకాశం ఉందనే వాదనలు ఉన్నాయి. ఈ తయారీకి జాయింట్ కలెక్టర్ అనుమతితో ఆర్డీఓ నిబంధనలను పరిశీలించిన తరువాత మాత్రమే లైసెన్సులు జారీ చేస్తున్నారు.

అనుమతి లేకుంటే చర్యలు



బాణసంచా తయారీకి అనుమతి లేకుంటే కఠిన చర్యలు తప్పవు. ప్రజల భద్రత దృష్ట్యా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. అగ్నిమాపక, రెవెన్యూ, పోలీస్, పొల్యూషన్ కమిటీతో తరచూ పర్యవేక్షణ చేస్తున్నారు. ఇది భద్రత కోసమే అనే విషయాన్ని గమనించాలి.
–ఎస్ఎల్ఎన్ కుమారి, తహసీల్దార్, సామర్లకోట

హాజరు నమోదు చేయాలి



పెద్దాపురం మండల పరిధిలో మూడు బాణసంచా తయారీ షాపులకే అనుమతి ఇచ్చాం. జి.రాగంపేటలో ఒకటి, గోరింటలో ఒకటి, పెద్దాపురం పరిధిలో ఒక షాపునకు అనుమతులు ఉన్నాయి. అక్కడ బాణసంచా తయారీ కార్మికుల హాజరు ప్రతి రోజూ నమోదు చేయాలి. అదే విధంగా స్టాక్ రిజిస్టార్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.
–వజ్రపు జితేంద్ర, తహసీల్దార్, పెద్దాపురం

హుండీల ఆదాయం లెక్కింపు



అధికారుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కించిన సిబ్బంది

పెద్దాపురం: స్వయం భూ తిరుపతి శృంగార వల్లభుని ఆలయానికి హుండీల ద్వారా రూ.32,00,718 ఆదాయం సమకూరిందని దేవదాయశాఖ డీఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్ తెలిపారు. గురువారం దేవదాయశాఖ తనిఖీ అధికారులు బీవీఆర్ చౌదరి, ఎంఎం వీరభద్రరావు పర్యవేక్షణలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా నారాయణమూర్తి మాట్లాడుతూ 90 రోజులకు గాను స్వామివారి హుండీల ద్వారా 25,15,938, అన్నదానం హుండీల ద్వారా రూ.6,84,780 ఆదాయం సమకూరిందన్నారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, ఆలయ కమిటీ సభ్యులు అడబాల జగ్గారావు, రాకుర్తి కుమారి, కుంచే వెంకన్నతో పాటు ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమచార్యులు, నారాయణాచార్యులు (చిన్నా), ఆలయ సిబ్బంది, కాండ్రకోట గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



కొండెవరంలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



అమరవిల్లిలో లబ్ధిదారులకు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కొత్తపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండెవరంలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రజల్లో రోజురోజుకూ ముఖ్యమంత్రికి పెరుగుతున్న ఆదరణను చూసి సహించలేక టీడీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండి పడ్డారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని తెలిపారు. కార్యాక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరవిల్లిలో..

మండలంలోని అమరవిల్లిలో లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ పులి జయబాబు ఆధ్వర్యంలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విద్యుత్తు ఫోరమ్ చైర్మన్ సత్యనారాయణ



చైర్మన్ సత్యనారాయణకు ఫిర్యాదు చేస్తున్న ఇండస్ట్రీయల్ ఎస్టేట్ అసోసియేషన్ కార్యదర్శి గంజి బూరయ్య

సామర్లకోట: విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యుత్తు పంపిణీ సంస్థలో వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం ఏర్పాటు చేశామని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ (విశ్రాంత న్యాయమూర్తి) అన్నారు. గురువారం స్థానిక సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలను వినియోగదారులు లిఖిత పూర్వకంగా ఆధారాలతో అందజేయాలన్నారు. సమస్యలుంటే స్థానిక విద్యుత్తు కార్యాలయం అసిస్టెంట్ ఇంజినీర్ స్థాయి సిబ్బందిని సంప్రదించాలన్నారు. అప్పటికే పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. వినియోగదారుల సమస్యలను న్యాయస్థానం క్షుణ్ణంగా పరిశీలించి వినియోగదారులకు సత్వర న్యాయం చేస్తుందన్నారు. బిల్డింగ్‌లో లోపాలు, విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, మీటర్లు కాలిపోవడం, విద్యుత్తు లోఓల్టేజీ హెచ్చు తగ్గులు, విద్యుత్తు మీటర్ల లోపాలు, కొత్త సర్వీసులు, అదనపులోడు వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. స్థానిక ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో ఉన్న చిన్న పరిశ్రమలకు విద్యుత్తు అంతరాయం కారణంగా పరిశ్రమల నిర్వహణ కష్టంగా ఉందని ఆయా పరిశ్రమల యజమానులు గంజి నరసింహారావు (బూరయ్య), ఆర్వీ సుబ్బరాజు, ఆర్వీ రవికుమార్, ఎం.అశోక్, ఆర్.బాబ్జి ఫిర్యాదులు చేశారు. పరిశ్రమలకు 24 గంటల విద్యుత్తు సరఫరా ఉండేలా చూడాలన్నారు. స్థానిక టిడ్కో ఇళ్లకు సంబంధించి విద్యుత్తు మీటర్లకు రూ.450 చొప్పున లబ్ధిదారులు చెల్లించగా, ఆ కట్టలేదని స్థానిక అధికారులు అంటున్నారని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. అయితే దీనికి సంబంధించి నేరుగా లబ్ధిదారుల నుంచి లిఖిత పూర్వకమైన ఫిర్యాదు ఉండాలన్నారు. చెల్లించిన బిల్లులు ఉంటే తదుపరి బిల్లు నుంచి తగ్గించడం జరుగుతుందన్నారు. ఫోరమ్ సభ్యులు ఎస్.హరిబాబు, వి.జనార్ధనరావు, రాయసం సురేంద్రకుమార్, విద్యుత్తు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.ఉషారాణి, ఆపరేషన్ ఈఈ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్, ఏడీఈలు కిరణ్, రాంబాబు, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం ఏఈలు పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీపాద శ్రీవల్లభ స్వామి



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

పిఠాపురం: ప్రముఖ దత్త పుణ్య క్షేత్రమైన పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో శ్రీపాద శ్రీవల్లభ జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి పల్లకీ సేవ, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తుల నడుమ స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వందలాది మంది మరాఠీ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పిఠాపురం పట్టణ పుర వీధుల్లో స్వామివారి గ్రామోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ ఈఓ సౌజన్య ఆధ్వర్యంలో వారంరోజుల పాటు జయంత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మహారాష్ట్ర నుంచి భారీగా తరలివచ్చిన మరాఠీలు భక్తులకు ఆలయ అధికారులు వసతి, భోజన సౌకర్యాలు కలిపించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేస్తున్న ఉపాధి సిబ్బంది

తుని రూరల్: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 19 నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ పసుపులేటి నారాయణరావు గురువారం తెలిపారు. సోషల్ ఆడిట్‌కు అవసరమైన రికార్డులను ఏపీఓ పర్యవేక్షణలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు సిద్ధం చేస్తున్నారు. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకూ వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ పనులకు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.18.50 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. ఈ మొత్తం పనులకు సోషల్ ఆడిట్ జరగనుందన్నారు. సోషల్ ఆడిట్ అనంతరం గ్రామ, మండల స్థాయిలో ప్రజా వేదికలు నిర్వహించి నివేదికలను వెల్లడిస్తామని తెలిపారు.

పేదలకు అండగా ప్రభుత్వం



ఆర్‌బీ పట్నంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ సత్యవతి తదితరులు

పెద్దాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎంపీపీ పెంకే సత్యవతి, పార్టీ సీనియర్ నాయకుడు పరిమి శ్రీను అన్నారు. రాయభూపాలపట్నంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు గురువారం గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లల నాగేంద్రబాబు, పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్టా వెంకట్రావుతో కలసి పంపిణీ చేశారు. సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఠంచనుగా ప్రతి నెలా 1న తెల్లవారుకుండానే పింఛన్ అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌ది అని అన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల మంజూరు కోసం కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అర్హత ఉంటే చాలు పింఛన్ మంజూరు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనను బేరీజు వేసుకుని రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టంకట్టాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో పెంకే కిట్టు, చీకట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



శిక్షణ పూర్తి చేసుకున్న కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేసిన సుజాత

సామర్లకోట: శిక్షణ తరగతులతో అనేక కొత్త విషయాలు తెలుస్తాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిఠాపురం మున్సిపల్ నోడల్ అధికారి సీహెచ్ సుజాత అన్నారు. స్థానిక టీటీడీసీలో కాకినాడ కార్పొరేషన్, తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీలలోని సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న 11 బ్యాచ్ శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ కార్యదర్శులకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ డిజిటల్ వ్యవస్థ, సచివాలయాల్లో విధుల నిర్వహణ తదితర అంశాలపై నాలుగు రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. మొత్తం 1,950 మంది సచివాలయ కార్యదర్శులు పాల్గొనగా, దీంతో కాకినాడ జిల్లా పరిధిలో శిక్షణ పూర్తయిందని సుజాత తెలిపారు. ఫ్యాకల్టీ శ్రీకైలాస్, తేజలు శిక్షణ నిర్వహించగా మున్సిపాలిటీల నోడల్ అధికారులు యు.జ్యోతిరాణి, ఎస్‌వీ రామారావు, కె.ప్రసన్నవదన్, కె.శ్రీనివాసరావు, పి.సురేంద్రకుమార్, కేపీ ప్రసన్నలు పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.

హిందీ భాషా దినోత్సవం

అన్నవరం: స్థానిక సంకల్పం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సత్యదేవ సంస్కృతోన్నత పాఠశాలలో గురువారం హిందీ దివస్ నిర్వహించారు. సంకల్పం సంస్థ గౌరవ సభ్యుడు కోట నాగేంద్ర కుమార్‌రాజా ఆధ్వర్యంలో అన్నవరం, పరిసర గ్రామాల విద్యార్థులకు హిందీ భాషపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం హైస్కూల్ హెచ్ఎం అల్లాడ వెంకటేశ్వరరావు, రిటైర్డ్ డీఈఓ వేంకట రమణ, దేవస్థానం హైస్కూల్ ఉపాధ్యాయులు, సంకల్పం సభ్యుడు మహేంద్రవాడ జగదీష్ తదతరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

జగ్గంపేట: జాతీయ హిందీ భాషా దినోత్సవం సందర్భంగా జగ్గంపేటలోని విద్యార్థులకు కడియం గ్రామానికి చెందిన కొత్తపల్లి సత్యనారాయణ 200 మొక్కలు పంపిణీ చేశారు.

విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలి



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అనంతరావు తదితరులు

పెద్దాపురం: విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి చూపాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు బి.అనంతరావు అన్నారు. స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో గురువారం రాష్ట్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి ఓ ప్రాజెక్టును తయారు చేసి విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారిలో సృజనాత్మకతను వెలికితీసి బాల శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ముఖ్యోద్దేశమన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు, శ్రీప్రకాష్ పాఠశాల అకడమిక్ కో–ఆర్డినేటర్ ఉషా చైతన్య మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. అనంతరం ఓజోన్ పొరను రక్షించండి.. భూమాతను కాపాడండి అనే గోడపత్రికను ఆవిష్కరించారు. స్కూల్ అకడమిక్ కో ఆర్డినేటర్లు కె.వెంకట్రావు, ఎం.ప్రశాంతి, కుమార్, మహేశ్వరరావు, కుమారస్వామి, బి.సత్యప్రసాద్, పిఠాపురం సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి 123 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు.

ఆక్రమణల చెరలో పంట కాలువలు



కొత్తపల్లి-ఉప్పాడ రోడ్డులో పంట కాలువను ఆక్రమించడంతో రవీంద్రపురంలో రహదారిపై నిలిచిపోయిన వర్షం నీరు

కొత్తపల్లి: మండల పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న పంట కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయి. గ్రామాల్లో పంట కాలువలను పూడ్చి అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారు. కొత్తపల్లి-ఉప్పాడ, ఉప్పాడ-అమినాబాద్‌తో పాటు పలు గ్రామాల్లో సైతం పంట కాలువలు పూర్తిగా ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో రోడ్లపై నీరు నిలిచిపోతోంది. ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులే అక్రమ నిర్మాణాలకు అనుమతులను జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పంట కాలువలను ఆక్రమిస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరుకే ఇరిగేషన్ అధికారులు ఉన్నారని, మామూళ్లు ముట్టచెప్పితే నోరుమెదపరని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

రౌతులపూడి: ఈ ఏడాది రైతు భరోసా పథకం లబ్ధి పొందేందుకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు సూచించారు. గతంలో లబ్ధిపొందిన రైతులు ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా ఈ పథకంలో లబ్ధిపొందాలనే రైతులు తప్పనిసరిగా స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదారు పాసు పుస్తకం, నమూనా ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జెరాక్స్‌లను దరఖాస్తులో జత చేసి సిబ్బందికి అందించాలని సూచించారు

ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపుపై హర్షం

గోకవరం: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని ఆర్టీసీ గోకవరం డిపో యూనియన్ చైర్మన్ పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, అధ్యక్షుడు ప్రగడ ప్రసాద్, కార్యదర్శి అక్కిరెడ్డి కృష్ణ అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైన తరువాత అధికంగా ఉద్యోగులు ఉన్న ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చి ఉద్యోగుల సమస్యలపై అధికారికంగా మాట్లాడే అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



సామర్లకోట మండల స్థాయి కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సామర్లకోట: విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 14 నుంచి 17 ఏళ్ల విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తుంన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చడం ద్వారా నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో బహుమతులు సాధించాలన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య అధ్యక్షత వహించగా ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓ–2 పి.వుల్లయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు తాళ్లూరి వైకుంఠం, వై.బంగార్రాజు, ఎం.వెంకటేశ్వర్లు, ఇబ్రహీం, సునయన శ్రీదేవిలు పోటీలను పర్యవేక్షించారు.



మహారాణి కళాశాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, చైర్‌పర్సన్

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

పెద్దాపురం: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అన్నారు. స్థానిక మహారాణీ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. అప్పుడే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, నాయకులు లక్కాకుల కృష్ణ, ఆయా పాఠశాలల పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.